ముందడుగు

12 5 79

ముందడుగు

శ్రీ జంపన

ప్రకాశకులు :
వెంకటేశ్వర
పబ్లిషింగ్ హౌస్,
ప్రొ. ఎం. వి. అప్పారావు
అండ్ సన్స్, రాజమండ్రి.

6

ముందడుగు

జంపన చంద్రశేఖరరావు
యం. ఏ. బి. ఇడి.
ఏ [illegible]

ప్రథమముద్రణ
ప్ర. 750 లు.

Q H No E G 94
మార్చి 1946.

మూల్యం:
ఆరణాలు

శ్రీనివాసాప్రెస్,
రాజమండ్రి.

1

వేయివోయ్ మగవాడ "ముందడుగు వేయివోయ్
వేయువోయ్ -
ముందడుగు వేయువోయ్;
వెనుక పడితే
వెనుకే నోయ్—"

"అమ్మా! ఈడొచ్చిన పిల్లవు. పెళ్ళి చేసుకోకుండా ఎంతకాలం ఉండగలవ్? నేటివరకూ మా రెక్కలమాటున దాచి పెంచుకున్నాం. నేడో రేపో మా రెక్కల నామృత్యుదేవత ముక్కలుచేస్తే, నీవెక్కడ తలదాచుకో గలవ్?

అమ్మా! మణీ! ప్రతిపిట్టకూ ఒక చెట్టు అవసరం. చెట్టే కాదు- చెట్టుమీద ఉండడానికి గూడు ఎంత అవసరమో, స్వేచ్ఛగా ఎగరడానికి ఆకాశమూ అంతే అవసరం. గూట్లోనే శాశ్వతం ఉంటే, రెక్కలు సాగక మురికిజీవం అవుతుంది. అలాగే ఎప్పుడూ గాలిలో ఎగురుతూఉంటే, చీకట్లో దారి తప్పి, గద్దగూబలకు గురి అవుతుంది.

మణమ్మా! ప్రతిస్త్రీకి పెంచిన తల్లిదండ్రులెంత అవసరమో, శాశ్వతం పోషించే భర్తా అంతే అవసరం.

ఒక్కమాట చెబుతా వినుతల్లీ! పెళ్ళిచేసుకుంటం కేవలం భర్తనేవాడొకడు పోషిస్తాడనే కాదు. జీవితంలోని కష్టసుఖాలు చెప్పుకుంటానికైనా ఒకడుండాలికదూ? అతడేభర్త.

పెరిగే పెరిగే లతకు ఏదో ఆశ్రయం ఉండకపోతే, విచ్చలవిడిగా మిన్నంటా పాకిపోగలదా? ఆలోచించు... అంచేత నీకు నచ్చినవానిని- మాచూపు మట్టిలో చొచ్చుకుపోకుండానే- పెళ్ళిచేసుకోతల్లీ!"

తల్లి అలా రోజూ చెబుతూ ఉండేది. ఆమె చెప్పిన మాటలన్నీ మననం చేసుకుంటూ మణమ్మ చెరువులో బట్టలు ఉతుక్కుంటూ ఉంది.

మణి తల్లి పార్వతమ్మ పోయినప్పటినుంచీ సంసారభారం అంతా మణేవహించవలసి వస్తూంది. ఎన్నికష్టాలైనా రానీయ్, చిరునవ్వుతో స్వీకరిస్తుంది. కాలప్రవాహానికి ఎదురీత కొట్టాలనేదే ఆమె దృఢసంకల్పం. ఏటవాలుగా పడిపోవడం పిరికివాళ్ళలక్షణం అని ఆమె నిశ్చితాభిప్రాయం.

మణి తనలో తానేదో నిమ్మదిగా పాడుకుంటూ-బట్టలు ఉతుక్కుంటూంది.

అంతలో మునసబుశోభనంగారి కుమారుడు సుబ్బయ్య పరుగు పరుగున ఆతృతతో ఆమె దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

అతడ్ని చూసీ చూడనట్లామె నటిస్తూంది.

"ఏయ్! ఇదిగో!"

ఆమె తలెత్తి చూడదలేదు.

“ఇదిగో— నీకే—”

ఆమె గొంతు హెచ్చించి పాడుతూంది.

“ఏయ్! నీకే— నిన్నే— చెవుఁడా?”

ఆమె వాలుజడ కొరడా కదిలినట్లు కదలగా తలఎత్తి చూచింది, అతగాడు ఖిన్నుడైపోయాడు.

“ఏయ్! ‘ఏయ్’ ఏమిటి?”

“తప్పా?”

“తప్పా తప్పున్నరా! సొంత పెళ్లాన్ని పిలిచినట్లే పిలుస్తున్నావే?”

“పెళ్ళాల్లో కూడా సొంతం, ఎరువని ఉంటారా?”

“పేరుపెట్టి పిలవలేవ్?”

“పిలవకూడదన్నారుగా పెద్దలు?”

“ఏం? నాపేరేమైనా చెడిపోయిందా?
విషమాత్రరాలతో ఏకవి అయినా కూర్చాడా?”

“అబ్బే! అందుకు కాదు.”

“మరింకెందుకు?”

అతని ముందుకొచ్చి నిలబడింది.

‘ఎవరి పెళ్లాం పేరు వారు చెప్పకూడదన్నారుగా.

‘అయితే నీ పెళ్ళాన్నా?’

“అవుతావనే కదూ?’

‘తాళిబొట్టు కట్టి తలంబ్రాలు పోశావా?’

"పోయించాలనేకదూ తీసుకు రమ్మన్నాడు!'

"ఎవరు?"

"ఇంకెవరు? మీనాన్న - మామావ.'

"చాల్లే, ఊరుకో. నా పెళ్ళికి అంగు నెవరు?"

'మీనాన్న మరచావా? మా ఘావ—'

"పిచ్చిపిచ్చిగా వాగక—'

ఆమె మళ్ళీ రేవులో దిగింది. కుబుసం తీసిన నెల్లతా చులా కోపంతో బుసబుస పొంగిపోతూంది.

ఆమె ఎవరేది చెప్పినా వింటుంది. తనకుతోచింది చెబుతుంది. కాని 'పెళ్ళి' అంటేచాలు- కనకనమండే నిప్పులు కక్కుతుంది.

నాలుగు నిమిషాలలాగే నిలబడ్డాడు సుబ్బన్న. ఆమె అలాగే బట్టలు ఉతుక్కుంటూ ఉంది.

మణెమ్మా!'

"ఊఁ; ఏఁ?"

'ఇలా ఎంతసేపు నిలబడాలి?"

"నీఇష్టంవచ్చినంతసేపు, నేనేమైనా నిలబడమన్నానా?"

'మరి నీవురాకపోతే ఎలా?"

'నేనెందుకు?'

'మీనాన్న నిలబడినట్లుగానే తీసుకురమ్మన్నాడు—'

"ఎందుకు?'

పాపం! పోయే ప్రాణం, వచ్చేప్రాణం పోసి ఎగ తన్నుతూంది.'

'అయితే.'

'గుక్కెడు ప్రాణం గుడిదాటిపోకుండానే నీకూ నాకూ నాలుగక్షింతలు వెయ్యాలని— తుదికోరిక పోతే పాడుప్రాణి పోదు—"

"చచ్చినట్లే ఉంది'

'రామ, రామ, చావండే. చస్తూ చస్తూ ఉన్నాడు.

'ఆయనమాటకాదు; ఆయన ఉద్దేశంమాట.'

'అలాగా.'

"ఇంకేంలాగనుకున్నావ్?

'ఎలాగా అనుకోలేదు. ఎలా అనుకోమంటే అలాగే అనుకుంటా. నీగిరిదాటతానా?"

'చాల్లే కానీ పద.'

'సరే, ముందునే దిగడతాను. నీవు వెనకాల నెమ్మదిగానే రా.'

'ఏం?'

"ముందు వెళ్ళకపోతే, ఆకాస్తప్రాణాలూ గుటుక్కుమంటే, మన అంక్షితలు అగువు కాతాలో పడినట్లు, మిండిగుంటవు. నామాటింటావ్?"

'చాల్లే సరసం. పద, పద—'

ఇద్దరూ కలిసి మణమ్మ పాతకొంప చేరుకున్నారు.

♦ ♦ ♦ ♦

అది నులకమంచం.

మణి తండ్రి రావన్న మరణవేదన అనుభవిస్తూ,ఉన్నా డు. మణిలోపలకు వెళ్ళి బిందీ బట్టలూ గదిలో పెట్టి తండ్రిదగ్గర కొచ్చి మంచంమీద కూర్చుంది.

''అమ్మా! మణీ!''

"ఏం నాన్నా?'

'అయిపోయిందమ్మా నాపని.'

'దానికి విచారం ఎందుకునాన్నా! వెనుకా ముందుగా అందరిపనీ అయిపోవలసిందే.పుట్టినవారు గిట్టకుండాఉంటారా? గిట్టినవారు పుట్టకుండా ఉంటారా? ఈజీవరథచక్రం ముక్తిమం టపం చేరేవరకూ తిరుగుతూ ఉండవలసిందేగా? ఇందులో తప్పేదేముంది?'

"అమ్మా! మాసిపోతుందమ్మా నాబ్రతుకు.'

నీబ్రతుకేకాదునాన్న ఈసకలచరాచర ప్రపంచం అంతా ఏదో ఒకనాడు నామరూపాలు లేకుండా మాసిపోవ లసిందే. తప్పదు. విధాతకూడా తప్పించలేదు."

'అమ్మా!"

"నాన్నా! అయ్యో! ఎందుకీ కన్నీళ్ళు. మనజీవితాల నెలా ప్రేమిస్తామో, మన మృత్యువునుకూడా అలాగే ప్రేమిం చాలినాన్నా!ఒకరూపాయికి చక్రవర్తిముద్ర ఎంతముఖ్యమో, అటు అక్షరాలుకూడా అంతేముఖ్యము. వానిలో ఎక్కువ తక్కువలులేవు. అలాగే జీవితం అనే రూపాయికి ఒకవైపు

ముద్ర "పుట్టుక" మరొకవైపు ముద్ర "చావు" ఈ చావు పుట్టుకలు రెండూ జీవితం అనే నాణ్యానికి ఒకటే నాన్నా!

చూడండీ! రూపాయి ఎంతమంది చేతుల్లోనుంచో జారిపోతుంది. కొందరిని నవ్విస్తున్నది. కొందరిని ఏడిపిస్తుంది. రూపాయిచేతికి రాగానే ప్రతివాడూ- మహాత్ములు తప్ప- పొంగి పోతాడు. చేతినుంచి జారిపోగానే కృంగిపోతాడు. జీవితం ఇంతే. మనం పుట్టగానే ఆనందం; గిట్టగానే దుఃఖం.

నాన్నా! ఇలా నవ్వించి, ఏడ్పించి, పసిజల నాడించిన ఆరూపాయి అరిగి పోగానే ప్రభుత్వం మళ్ళీటంకసాలలో కరిగిస్తుంది. పోతపోస్తుంది. కొత్త రూపాయిగా మ ళ్ళీ దానినే తయారుచేస్తుంది. దానికా రూపాయిగాని, ఆరూపాయిని వదులుకున్న బంధుకోటిగానీ విచారించడం ఎందుకు?

అలాగే ఈజీవితం వార్థక్యంలో అరిగిపోతుంది. మృత్యు మందిరంలో మళ్లీ పోత పెట్టబడుతుంది. దానితో మరింత పదునుగా, మరింత కొత్తగా తయారవుతుంది. ఇందుకు విచారం ఎందుకు? పైపెచ్చు సంతోషించాలి. ఏమంటారు?'

'ఏమంటాను తల్లీ! అంతా అవునంటాను. ముళ్ళచెట్టుకు గులాబీపువ్వులా నీవు మాకడుపున పుట్టావ్ తల్లీ! ఇవన్నీ నేను చెప్పినవైనా, మరణకాలంలో మరచిపోయాను. మళ్ళీ జ్ఞాపకంచేసి ధన్యుణ్ణి చేశావు తల్లీ!

అమ్మా! బాగా బ్రతికున్నంతకాలం వ్యామోహాన్ని విరిచి తనాన్ని దగ్గరకు చేరనీయకు లేదు కదూ! అంటేనే అది కష్ట

గట్టి ఊపవచ్చే ముందు వేయి ఏనుగుల బలంతో నాశిరసుపై నాట్యం చేస్తున్నాయ్... అమ్మా! అదెవరు! ఆనల్లనిమనిషి-'

అతడు భయపడిపోతున్నాడు. ఆ మూర్తి చేతులు కళ్ళ కద్దుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. మణికి దుఃఖం పొంగి పొర్లిపోతూంది. కాని లోలోన దిగమ్రింగుతూంది.

'అమ్మా! ఎవరది?''

''భగవంతుడు నాన్నా!''

''మరి నల్లగా ఉన్నాడే!

'వ్యామోహం; వికారితనం అనే నల్లని అద్దాలు పెట్టుకున్నావ్ కదు నాన్నా! అందుకే ఆ తేజోస్వరూపుడలా కనిపిస్తున్నాడు. నాన్నా! సూర్యచంద్రాదులు, నక్షత్రాలు, తెల్లగా ఎంతో తేజోవంతంగా ఉన్నా మనం నల్లద్దాల కళ్ళజోడు పెట్టుకొనే సరికి నల్లగానే కనిపిస్తారు. అలాగే భగవంతుడు కూడా''

అతడానందంతో కళ్ళు తెరిచాడు.

మణీ! మా బాగా చెప్పావు తల్లీ! అయితే భగవంతుడేనా ఇంతకుముందు వచ్చింది.

''తప్పకుండా నాన్నా! పుట్టినప్పటినుంచి చచ్చేవరకూ మన నీడలా మనతోనే వెంటుండే అంటిపెట్టుకొని ఉండేది అతనే నాన్నా!'

'అప్పుడప్పుడు ఉద్భవించిన మాలిన్యాన్ని అపహరించే అనురాగ మూర్తి అతడే.''

"అతణ్ని మరిచిపోతేనే ఈకష్టాలు; ఈకన్నీళ్లు."

"అవునుతల్లీ! అవును"

అతడు కన్నులుమూసుకొని పరమాత్ముని ప్రార్థిస్తూ ఉన్నాడు. మణి ఆనందగాఢ పారవశ్యురాలైపోయింది.

ఆ తండ్రికూతుళ్ళ గొడవంతా ఏదో అయోమయంగా ఉంది. అక్కడే నిలబడిన మామసబుకు, మనసులోకొడుకు సుబ్బయ్యకు తన పెళ్ళికి మణెమ్మను ఒప్పించుకుంటా ఆకాస్త ప్రాణాలూ గుటుక్కుమంటాయేమోనని సుబ్బయ్య ఖంగారు పడ్డాడు.

"మామయ్యా! మామయ్యా!"

ఆ విస్మృతిలో పిలిచి పిలుపు విన్నాడు. చక్కటి భగవద్ధ్యానం ముక్కలయింది. కన్నులు తెరచి నాలుగుమూలలా కలయజూశాడు. సుబ్బయ్య శోకవదనం కళ్ళకు కట్టింది. జ్ఞాపకం వచ్చింది అమ్మాయి పరిస్థితి. తాను ప్రపంచయాత్ర ముగిస్తే, అమ్మాయికి "నా" అనేవాళ్ళెవరూ లేరని జ్ఞాపకం వచ్చింది. అందుచేత ఆమెను బుద్ధిమంతుడైన సుబ్బయ్య చేతుల్లో పెట్టి వెళ్ళాలనుకున్నాడు గోపన్న.

"మామయ్యా! నామాటేం చెప్పావ్?"

"సుబ్బయ్యా..."

కుమార్తెను దగ్గరికి పిలుచుకున్నాడు. ఆమె చేయి తన చేతులతో పట్టుకున్నాడు.

"అమ్మా! మణీ! నా తుది కోరిక తీర్చవూ!

"నాన్నా! కోరికలకు "తుది" ఏముంది? చచ్చేవరకూ కోరికలుంటాయ్. చచ్చింతరువాతకూడా కోరికలుంటాయ్. దీనికి అంతెక్కడిది నాన్నా!"

'అమ్మా! నాముద్దు చెల్లింతవా!'

'... ... ..."

"నా ఆశ నిరాశచేస్తావా తల్లీ,"

"నేనేం చేశాను నాన్నా !"

"నా తరువాత "నా" అనే వారెవరమ్మా నీకు!"

"భగవానుడు."

"వేదాంతం తిండీ బట్టా ఇవ్వలేదమ్మా!"

"తిండీ బట్టా ఇవ్వలేదు. కాని అవి దొరికే మార్గం చూపిస్తుంది. ద్వారాలు తెరిచి సత్యపదాన్ని మన ముంగు ప్రత్యక్షింప చేస్తుంది. అనుకున్నా పనినల్లా ఆచరించడానికి ఆత్మీయశక్తినిస్తుంది.

అతడు రెండు నిమిషాలు మాట్లాడకుండా కళ్ళుమూసుకొని బాధ ననుభవించాడు. తరువాత కళ్లు తెరచి దీనంగా కూతురువంక చూసాడు.

"ఏం నాన్నా !"

"అమ్మా! నీవెన్నైనా చెప్పు. నిన్నీ సుబ్బయ్య చేతుల్లో విడిచిపెడితే, నా ఆత్మ శాంతిగా ఆకాశపథంలో ప్రయాణంచేస్తుంది. లేకపోతే..."

"భయపడకు నాన్నా!"

"అమ్మా! ఆడవారికి ఒకరి ఆశ్రయం అవసరంతల్లీ! అందులోనూ యౌవనంలో ఉన్న వారికి అతి అవసరం... చెట్టు ఎదిగేవరకూ చుట్టూ కంచె అవసరం. లేకపోతే దోవను పోయే ప్రతి మేకా చివుళ్ళు మేస్తుంది. ప్రతి ఎద్దూ కొమ్మలు విరిచి తొక్కి పారేస్తుంది. చెట్టు పెద్దదయ్యాక ఏ అవసరం లేదు ..అలాగే స్త్రీకి కూడా యౌవనంలో రక్ష ఉండాలి"

"నాన్నా! చెట్టులకు స్వరక్షణ శక్తిలేదు. మానవులకుంది. నీవు భయపడకు నాన్నా! నన్ను నేను రక్షించుకోగలను. ఆ ధైర్యం, ఆ ఆత్మ విశ్వాసం నాకు లేకపోలేదు.'

"స్వార్థ భూయిష్ఠమైనది సంఘం; కామార్తులు ప్రజలు; నీవు ఆడదానివు—ఏకాకివి. ఎన్ని కష్టాలు ఎదుర్కోవలసి ఉంటుందో ఆలోచించుకో."

"ఆలోచించుకొన్నాను. ఏకాకిగా ఉండడానికే నే నిశ్చయించుకొన్నాను. ఎన్ని కష్టాలకైనా ఎదురీదుతాను. సంఘానికి "ముందడుగు" వేస్తా. సంఘాన్ని నా వెనుక నడిపిస్తా.'

"అహంకారం హానికరం తల్లీ!"

"ఇది అహంకారం కాదు నాన్నా! ఆత్మశక్తి; ఆత్మ ప్రబోధం."

'అయితే సంతోషం.'

"నాన్నా! మీ మాట జవదాటననుకోకండి. ఏనాడు నాకు పెళ్ళి అవసరం అని తోస్తుందో, ఆనాడు తప్పకుండా

చేసుకుంటా. కాని అంతవరకు ఈ జీవితాన్ని ప్రజాసేవలో వినియోగించనీయండి. నాకంటే అజ్ఞానులు అంధత్వం బాపటంకంటే ఆనందం మరొకటిలేదు.

నాన్నా! ఈ పవిత్ర యజ్ఞంలో నన్ను ఆహుతికానియ్. ప్రజాసేవకై నన్ను అంకితంచనియ్. అంతకంటే కావలసిందేముంది?

మోసం–రోషం – మోహం – ద్వేషం– ఈ నాలుగు కులాలనూ రూపుమాపనీయ్. ఇందుకు తగినంత ఆత్మశక్తి అలవడేందుకు ఆశీర్వదించునాన్నా. అంతకంటే నిన్ను అర్థించేదేమీ లేదు.''

మణి ముఖం ఎఱ్ఱగా కందిపోయింది. కనులు కన్నీటి తెరల ముసుగుమాటు కదలిపోతూన్నాయ్.

రావన్న ఆమె సత్ సంకల్పాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నాడు. ఆనందాశ్రులు రాల్చాడు.

మణమ్మా! అర్థం అయింది. అగ్నిగుండాలను రగుల్చుకుంటున్న నీహృదయం అర్థం అయింది. నీవు అబలవుకావు. సబలవు. సంఘ రథసారథివి. అడుగువేయ్ తల్లీ! "ముందడుగు" వేయ్.

అమ్మా! ప్రజాభ్యుదయానికై పాటుపడు. ప్రజలకొరకై ప్రాణాలు బలిసేయ్.

దేశమాత కన్నీళ్లు తుడిచే వీరమాతవు కా తల్లీ! వీరమాతవుగా... భరతమాత నిన్నాశీర్వదిస్తుంది... భగవానుడు

నీకు తోడ్పడతాడు. తప్పక తోడ్పడుతాడు. పేదలంటే అతనికి ప్రాణాలు.

అభాగిని ఎలుగెత్తి ఒక్కసారి "ప్రభూ!" అని అరచిందా. అంటే అతని సింహాసనం కదిలిపోతుంది. అభాగినుల హృదయాలే అతని ఆలయాలు...భయపడకుతల్లీ! భగవానుడు నిన్ను రక్షిస్తాడు...వీరమాతవుగా...

అమ్మ! అదెవరు? అదెవరు?

భగవానుడునాన్నా! భగవానుడు.

భగవానుడే...భగవానుడా.

ఆఁ అతడే-నిన్ను రక్షించాలని...

వచ్చాడా?

అవును. వచ్చాడు.

అయితే ఆ తలుపులన్నీ తెరచేయ్...అబ్బా! ఏమి తేజస్సు...ఇంత తేజస్సు ఈ కళ్లు చూడగలవా? ఎంత తేజస్సు..

అతడు కన్నులు మూసేశాడు.

నాన్నా! నాన్నా!

గొల్లుమని అతనిమీద పడిపోయింది మణి.

"ప్రి...జా...సే...వకై...ముందడుగు వేయ్...

"ముం...ద...డు...గు"

మూసిన కన్నులు తెరువలేదు.

అతని ఆత్మ ఆకాశంమీద నక్షత్రం అయిపోయింది.

అతని జీవన రథసారథి రథందిగి విశ్రాంతి తీసుకుంటానికి వెళ్ళిపోయాడు.

గుళ్ళో గంట ఠంగ్ ఠంగ్ మని కొడుతున్నారు.

• • •

అతనిపై ముసుగువేసింది కన్నకూతురు.

'మణీ...విచారించకుతల్లీ! నేనున్నానుగా అన్నిటికీ. మునసబు మాటలువిని మళ్ళీ గొల్లుమంది.

ఏమంటే ఏముంది—

అతని జీవనజ్యోతి ఆరిపోయింది. అంతే

——

ii

రావన్న దహన సంస్కారాలనుంచి దినవారాలవరకూ మునసబు శోభనమే మణికి సాయంచేశాడు.

పెద్దదినం ఇంకా రెండురోజులుంది. ఊరిలో ఎవరెవరిని భోజనాలకు పిలుద్దాం అని ఆలోచిస్తున్నారు! శోభనం—మణి.

మణమ్మా! రావన్న బడిపంతులైనా బాగాబతికాడు.

అలాగే.

అందుచేత అతనంటే ఊరందరకూ చాలాఇష్టం.

అలాగే.

కాబట్టి నాలుగిళ్లు ఇడిచిపెడితే లాభం ఏముంది? ఊరందర్నీ పిలిచేస్తే సంతోషిస్తారు.

సంతోషించడానికి ఇదేమీ పెళ్ళిభోజనంకాదు మావయ్యా!

కాదనుకో. ఎంతమంది భోంచేస్తే సచ్చినోడి ఆత్మకి అంత మంచిదట.

"నాలుగు 'ఊట'లు కోసి మనలను 'నుంట'లుజేశారునేటివరకు. నేటికైనా కళ్ళు తెరచి ఈ ప్రియుక నాటకాన్ని చూడకపోతే ప్రయోజనం ఏముంది? ఎంతకాలం గడిచినా ఏనుగు ఎలక్కాయేతింటుంది. పులి మాంసమే తింటుంది. పశువు గడ్డేమేస్తుంది. జంతువుల్లో సృష్ట్యాదినుంచి అంతవరకూ ఆహార విహారాల్లో మార్పుఉండదు. కాని మనుషులలా కాదు. మృగప్రాయంగా ఉన్నప్పుడు మాంసాహారులయ్యారు. మానవత్వం అలవడగానే శాకాహారులయ్యారు. దేవ దైవత్వం అలవడితే నిరాహారులౌతారు. అలా మానవులలో ఉన్న పరిణామం మృగాదులలో ఉండదు. కారణం వాటికి విజ్ఞానంలేదు; మనకున్నది.

కాబట్టి మావయ్యా! ఏ కాలంలోనో, ఎవరో, ఎక్కడో, ఏదో చెప్పారని మనం ఇప్పుడు—గుడ్డిగా చేతులోబడినట్లు—చేయకూడదు. ఒక పనిచేసేటప్పుడు మన బుద్ధికుశలత నుపయోగించి "ఈ పనిచేయడం ధర్మమా? అధర్మమా?"

అని ఆలోచించి చేయాలి. ప్రకటించాలి–తర్కించాలి–కార్యం చేసి తరించాలి."

మనసబు విస్తుపోయాడు.

ఏం మాటాడాలో అర్థంకాలేదు.

ఆమె చెప్పిందంతా కొత్తగా ఉంది.

"మణమ్మా! అయితే ఊరంతా పిలువొద్దంటావ్?"

అవును.

ఎంతమందిని పిలుద్దాం

ఎంతమందినీ వద్దు.

అతడాశ్చర్యపోయాడు.

అంటే-అసలు పెద్దదినమే వద్దంటావా!

వద్దనే నా ఉద్దేశం.

అంతపని చేయకు మణమ్మా! పోనీ మన నలుగురం కలిసి చేద్దాం. కావాలంటే ఆ డబ్బు నే..."

అబ్బే! డబ్బుకాదు. అనవసరంగా దేమోనని..."

మన హిందూ ధర్మం ఒప్పుత్తా.

ఒప్పుతుంది కాబట్టి.

ఎట్లా?

మనకు ప్రమాణం గ్రంథం ఏది?

పద్దుల పుస్తకం.

అది కాదు మానయ్యా! భగవద్గీత.

ఊహూ...అయితే,

దాంట్లో ఏముందో తెలుసా!

ఎలా తెలుస్తుంది. పుస్తకమే చూడందే.

అయితే దాంట్లో ఇలాగుంది—

శ్లో॥ దేహినః, అస్మిన్ యథా దేహే,
కౌమారం, యౌవనం, జరా—
తథా దేహాంతర ప్రాప్తిః,
ధీరః, తంత్ర నముహ్యతి.

"అంటే"

"ఈ దేహంలో కౌమారుదశ, యౌవనదశ, వార్ధక్యం ఎప్పుడెలా వెళ్ళిపోతున్నాయో, అలాగే ఈ ఆత్మ ఈ శరీరాన్ని విడిచి మరో శరీరాన్ని ధరిస్తుంది. అందుచేత ఈ శరీరాన్ని గురించి ధీరులు మోహింపబడరు."

"అయితే ఏమంటావు?"

"ఈ ఆత్మ ఏ క్షణంలో ఈ శరీరాన్ని విడిచిందో, ఆ క్షణంలోనే మరో శరీరాన్ని ధరిస్తుంది.

"అయితే నరకంలో ఎప్పుడుంటుంది?"

"ఎప్పుడూ ఉండదు."

"అదేంటి?"

"మావయ్యా! స్వర్గనరకాలు కల్పితాలే కాని యదార్థాలు కావు."

"అయితే లేవంటావా?"

"ముమ్మాటికి."

మన పెద్దలు చెప్పిందంతా అబద్ధమే."

"తప్పక. వారెందుకు కల్పించారంటే—సామాన్యు లకు 'నరకయాతన' ఉన్నదనుమా నీవు తప్పులుచేస్తే అది చెబుతేగాని భయపడి మానేయురు. అలాగే మంచి పనులు చేస్తే 'స్వర్గసుఖం' వస్తుందనుమా అని బోధిస్తేగాని మంచి పనులు చేయరు. తెలిసిందా ? మనచే చెడ్డపనులు మాన్పించి, మంచిపనులు చేయించే నిమిత్తమే స్వర్గ నరకాలను సృష్టిం చారు. వారి ఆశయం మంచిదే. ప్రజలను చీకటినుండి వెలు గునకు నడిపించేదే."

"అయితే మణమ్మా ! మరి చచ్చినవాళ్ళకు గోదా నాలు, భూదానాలూ, సువర్ణదానాలూ చేస్తామే అదంతా బూటకమే."

"బూటకమా, మహా నాటకమా? మన పూర్వులు 'సర్వేజనో సుఖినో భవంతి' అని—ప్రజాభ్యుదయానికి కొన్ని నీతులు చెబుతే, వాటికి విరుద్ధ వ్యాఖ్యానంచేసి ఈ స్వార్థప రులు ప్రజలను పిండి పిప్పిచేస్తున్నారు..."

"అలాగా !"

"ఒక్కమాట చెబుతావిను—ఈ దానాలన్నీ పుచ్చు కొనేదెవరు ?"

"మన గురువులే—బ్రాహ్మలు, శ్రీవైష్ణవులు, సాతా నులు..."

"ఈ పుచ్చుకొన్నవారు చచ్చినవారి కెప్పుడైనా పంపించగా చూశావా?"

"ఎలా పంపిస్తారు? శుభ్రంగా పొలం దున్నించుకొని పండించుకుంటున్నారు. ఎక్కువైన ఆవుల్ని అమ్ముకొని మేడలు కడుతున్నారు. దానం ఇచ్చిన–బంగారంచే పెళ్ళాలకు, పిల్లలకు నగలు చేయిస్తున్నారు. చెమట చుక్క జారకుండా జీవిస్తున్నారు.

"వాళ్ళలా జీవించేటట్టు చేస్తుంది మీరు. మావయ్యా! మిమ్మల్ని తెలివితక్కువవాళ్ళను చేసి, ఈ లంచాలన్నీ గుంజే ఈ గురువులకంటే మహాపాతకులుండరు. కల్లూ పళ్ళూ తాకట్లుపెట్టి ఒక పాలేరివాడుకూడా ఈ సోమరి పోతులకు దానంచేస్తున్నాడే, వాడి ఉసురు వీళ్ళకు తగల్దూ...

మావయ్యా! ప్రేమించకపోయినా ప్రేమించినట్లు నటించి డబ్బుగుంజే వేశ్యల్లాగ- చచ్చినవాళ్ళకు ముట్టుతుందని చెప్పి, అమాయికుల నమ్మించి గో,భూ, సువర్ణ ఛత్రాంబరాలదానం పుచ్చుకొనే ఈగురువులు సంఘంలో చీడపురుగుల్లాగ బయలుదేరారు. కడుపునకు తిండిలేక దొంగతనం చేసే దరిద్రులను- కొరడాలతో కొట్టి, ఇనుపఊచల పంజరంలోని పక్షుల్లాబంధించే ఈప్రభుత్వం ప్రజలనెత్తురు పీల్చే ఈ భూలోక పిశాచలను- ఈమేకవన్నెపులులనుశిక్షించదెందుకో!

అయినా ప్రభుత్వానికి చెవులేగాని కళ్ళులేవు.

ఆమె ఉద్రిక్తురాలై పోయింది.

శోభనం ఆశ్చర్యపోతున్నాడు.

నాలుగు నిమషాలలాగే ఆమె చూస్తూంది.

మావయ్యా! ఈదానాలుచేసే వాళ్లైనా నూటికి తొంబయిమంది నిష్కల్మషభక్తితో చేస్తున్నారంటారా? నేను నమ్మను.

మరెందుకు చేస్తున్నారు?

ప్రజలమెప్పుపొందాలని. లోకాన్ని వంచించి చచ్చిన వాళ్ళయందు తమభక్తి శ్రద్ధలు చాటించుకుందామని.

"అలాగంటావా?"

"కాకపోతే– చూడండీ మనభూషణాన్ని బ్రతికున్నంతసేపూ తండ్రికి కడుపునిండా కూడు పెట్టక కాల్చుకుతిన్నాడు జబ్బుపడితేమందుకూడా ఖర్చుపెట్టక వేధించుకు తిన్నాడే. అతడు చావగానే వేలకు వేలు ఖర్చుపెట్టి దినవారాలు చేస్తాడా? దానాలిస్తాడా? ఇదంతా తండ్రిమీదప్రేమా? తన 'మెప్పు' మీద ప్రేమా?

నలుగురూ మెచ్చుకుంటారనే మనకుమాత్రం తెలీదూ?

ఇప్పటికైనా తెలిసిందా?

చెప్పింతరువాత తెలియదా? ఇంకచూసుకో ఈగురువులుగాళ్ళసంగతి...

మావయ్యా! మనతల్లిదండ్రులకుగాని, అత్తమామలకుగాని చచ్చేవరకూ వినయ విధేయతలతో సేవచేయడం

మనవిధి. చచ్చింతరువాత 'కర్మకాండ' మనదికాదు. భగవానునిది.

ఒప్పుకుంటావమ్మా! ఒప్పుకుంటా."

"చచ్చేవరకూ బాధించి, చచ్చింతరువాత పూజించడం ఎలాగుంటుందంటే— మనకళ్ళను మనం ఊడతీసి చూసుకోవాలని అనుకున్నట్లుంటుంది. కళ్లుతీసి వేలితో చూసుకుంటాం"

'అయితే మననలుగురం కలిసి ఏదో దండం పెడదాం'

"తప్పక"

'అమ్మా! మామంచిమాటలు చెప్పావు తల్లీ! నలుగురికీ ఇలాగే చెబుతూఉందూ? కాసింత అజ్ఞానం అన్నా పోతుంది."

"చెప్పడంలో గొప్పలేదు; చెప్పినవి చేయడంలోగొప్పతనం ఉంది. కావలసినవి కబుర్లు కావు; కార్యాలు. వేయవలసింది "వెనకడుగు" కాదు; "ముందడుగు"

"అవు నమ్మా! అవును."

మునసబు ఆలోచనలో మునిగి తేలుతూ తన ఇంటికి వెళ్లాడు. తండ్రిని తలుచుకుంటూ మాణమ్మ తన యింట్లోకి వెళ్ళింది.

♦ ♦ ♦ ♦ ♦

iii

"ప్రహా! అహా!...ఆహాహా! హా...ఆఆ...అహా!ఆహా!
ప్రభో! ప్రభో! కావనా! దే...వాః.. ప్రభో! ప్రభో"

ఏదో అలా పిచ్చిపిచ్చిగా పాడుకుంటూ మామిడి చెట్టుకొమ్మ మీద కూర్చుని ఊగుతూంది మణి.

ఆ అల్లరి పిల్లని దూరాన్నుంచే చూశాడు ప్రభోద్. తెల్లటి ఖద్దరులాల్చీ గాలి కెరటాలకు ఎదురీదుతూఉంటే — పంచికుచ్చిళ్ళు చేత్తో పట్టుకొని నవ్వుతూ తయారయ్యాడు.

నెమ్మదిగా పిల్లి అడుగులు వేసుకుంటూ ఆమె వెనకాలే నిలబడ్డాడు...అంతేగాదు. చెవిదగ్గరే నోరు పెట్టి 'కూః' అని గట్టిగా ఈలవేశాడు.

ఆమె ఉలిక్కిపడి చెవి నులుపుకుంటూ "అబ్బా! ఎవరది?" అని పక్కకు తిరిగి చూచింది. ప్రబోధ్ నవ్వుతూ నిలబడ్డాడు.

"చాల్లే! కోతిలాగ."

ఆమెకు కోపం వచ్చినకొద్దీ అతను విరగబడి నవ్వడం ప్రారంభించాడు. అతడు నవ్వినకొద్దీ ఆమె కోపం మిన్నులు ముడుతూఉంది.

ప్రభూ! నాకు మహా కోపం వస్తూంది. ఊరుకో... ఊఁ ఊరుకోపోతే చూచుకో...

"మణీ! నీకు ఎంతకోపంవస్తే నాకు అంత సరదా!"

'ఏం!"

"కోపాన్న కందిన నీముఖాం. ఎరుపెక్కిన నీకనులు, లేతగులాబీ రేకుల్లా కదిలే నీ పెదవులు, ఎంత బాగుంటా యను కున్నావ్!"

"చాల్లే."

ఆమె ముఖం పక్కకు తిప్పింది.

అతనుకూడా నెమ్మదిగా చెయ్యెక్కి ఆమె కొమ్మపైనే, ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమెమాట్లాడలేదు. ముఖం చిట్లిస్తూ కూర్చుంది.

అతగాడు నెమ్మదిగా ఇలా ప్రారంభించాడు.

గీతం :—

"కోపాన నీముఖము
కుంచుకొని పోతేను,
తాపాన నాముఖము
వంచుకొని ఉండాలి...

పగలెల్ల నీకళ్ళు
నిగనిగలు దాచినా,
కలలలో నీకళ్ళు
కదలు చెప్పక మానునా!

పాట పాటకు తీసి
వండించు కొను పికము,
మాట లాడక ఏల
మౌన ముద్రను దాల్చు?

నవ్వు- పెదవుల దాటి
నా యెడద మీటకే,
కన్నీట నా బ్రతుకు
కరిగించి వేస్తాను!

"చెప్పు మణీ!"

'చాల్లె పాడన్! ఈమాత్రం పాటలెవరికి రావను కున్నావు!"

"వస్తే నీవు పాడరాదూ!"

"ఎందుకు!"

"నీ ఆనందానికి; లేదా నాఆనందానికి."

"అవసరం వచ్చినప్పుడు పాడతాలే."

'అందాక నెమలిలా ఆడతావా!"

"ఏం ఆట!"

"కోతి కొమ్మచ్చి'

"నీకా ఆటవచ్చు; నాకురాదుగా"

"ఏం!"

'నీవు కోతివికనక వచ్చింది; నాకెలావస్తుంది!'

'అదా సంగతి!"

"చిత్రం"

ఆమె రొమ్మమీదనుంచి ఒక్క దూకు దూకి లేడిపిల్లగా బెదురుతూ పరుగుపెట్టింది. అతడూరుకుంటాడా! వెన్నాడి ఆమె చేయిపట్టుకొని తీసుకొచ్చి తన ప్రక్కనకూర్చోపెట్టుకున్నాడు.

ఇద్దరూ పొలంగట్టున కూర్చున్నారు. గట్టుపక్కనుంచి పోయే కాలవలో ఇద్దరు కాళ్ళూపుకుంటూ, చేల పక్కన మేసుకుంటూఉన్న ఆవుల్ని చూస్తూ ఉన్నారు.

'మణీ! రానురాను అల్లరిపిల్లవై పోతున్నావే.

"ఇంకా కావాలి ప్రభూ! అల్లరిలో ఆనందం మీ పట్నవాసం వాళ్లకేం తెలుస్తుంది!"

'కాలేజీస్టూడెంట్లం మాకు తెలియకపోతే, ఈసృష్టిలో ఎవరికి తెలుస్తుంది' 'విద్యార్థి రాజావిట సాక్షభామా!' అని ఊరకే అన్నారా!"

"చదువుకొనే వాళ్లకు జీవితంలో సరదా అసలు తెలీదనుకుంటా!'

'ఏం'

"పొద్దుటనుంచీ సాయంకాలం వరకూ స్కూళ్లోనే, ఆనాలుగు గోడలమధ్య ఖయిదీల్లా జీవితం గడిపే మీకు ఈ భోన్నచేలల్లోని సొగసు, ఆపంటకాలువ మలుపులోని వలపు

మధ్యమధ్య గొఱ్ఱెపొట్టేళ్ళలాగ తిరుగుకొచ్చే మబ్బులగుంపు,
ఆషాఢరెళ్ళ రొదలు, ఈచల్లగాలి సొదలు, ఆపాలపిట్టకథలు-
ఎలా తెలుస్తాయోయ్ ప్రభూ!

అల్లా చూడు ఎదురున్న పోతునెక్కి ఆకవతగాడెలా స్వారి చేస్తున్నాడో- ఇలాచూడు ఈనీళ్ళలో నగన ఎద్దుతోక పట్టుకొని ఆపాలేరు బుడతడెలా ఈదుతున్నాడో!

ఆచెరువుగట్టున చూడు చాకలివాళ్ళు ఆపా ముగా అనకుండా అంతా కలిసి మెలిసి, ఒకేపాట పాడుకుంటూ ఎలా బట్టలుతుకు తున్నారో? చదువుకోనివాళ్ళు ఆటలమురికైనా పోగొట్టి ప్రజాసేవ చేస్తున్నారు. చదువుకొన్న మీరు సంఘంలో ఏమురికి పోగొట్టి మీరు ప్రజాసేవ చేస్తున్నారు!

ప్రభూ! పగలల్లా ఆకాలేజీ ఖయిదుల్లో మగ్గిన ఖయిదీలు మీరేం చేస్తారు! ఉసూరు మంటూ ఇళ్ళకుపోయి ఏదో కాస్త మేసి, మళ్ళీ నాలుగుగోడలుమధ్య లైట్లముందు సిద్ధం. కాలేకాలే కాష్టం ముందుండే పిశాచాలుగా మీకూ తేడా ఏమిటి? అవి పుర్రెల్లో నెత్తురుపట్టుకొని తాగుతాయ్; మీరు కప్పులో టీ పోసుకు తాగుతారు. ఆ తెల్లని పుర్రెలకూ మీ తెల్లని కప్పులకూ భేదం ఏమిటి! ఆఎఱ్ఱని నెత్తురుకూ— మీఎర్రని టీకి భేదం ఏముంది!

"మణీ! వాటికేం విజ్ఞానం ఉంటుంది! మేం చదువుకుంటున్నాదెందుకు!

'తప్పు.

'విజ్ఞానికి'

'అక్కడికి మాకు విజ్ఞానం లేనట్లు!' ఏం!

'గాకపోతే, సత్ గ్రంథపఠనం లేందే విజ్ఞానం ఎలాకలుగుతుంది? విజ్ఞానంలేకపోతే మానవు లెలాగౌతారు''

"గ్రంథపఠన లేనివారికి విజ్ఞానం లేదా!"

"ఎలాగుంటుంది మణీ! అందుకనే మహమ్మద్ మహాశయుడు చెప్పాడు. "Learn from Craddle to Grave" అని అంటే తొట్టెదగ్గరనుంచి చచ్చేవరకూ చదవమన్నాడు. అలాచదివినవాడే విజ్ఞానులం అవుతాం. లేకపోతే పశువులమే.

అలాగా? అయితే ప్రభూ! రామకృష్ణపరమహంస ఏం చదువుకొని మహాత్ముడయ్యాడు? ఆయనకు విజ్ఞానంలేదా? ఆయనంటి విజ్ఞాని మీరు చదువుకొన్న వాళ్ళల్లో ఒకడున్నాడా?

సిద్ధిబాబూ! చీకటి లోకాన్నంతా విజ్ఞానదీపిక చే వెలిగించిన ఏసుక్రీస్తు ఏం చదివాడు? ఇప్పటికే బ్రతికుండి ప్రపంచానికి దివ్యసందేశం పంపించే శ్రీ రమణమహర్షి ఏం చదివాడు? ఆత్మజ్ఞాని అయిన నాగమహాశయుడేమిచదివాడు? ఇలా లక్షోపలక్షలు చూపించగలను ప్రభూ!

ఆబాల గోపాలానికి యదార్థ ప్రపంచకాని ముసుగు తీసి చూపించిన వేమనయోగి యేం చదువుకున్నాడు? ఆంధ్రులనుంచి అరవలవరకూ ఇంటింట అన్నాతగీతాల నాలాపన చేయించే భక్త త్యాగయ్య ఏం చదువుకున్నాడు?

అలా వెఱ్ఱిగా చూస్తావేం! చెప్పు జవాబు!

"అలాగే. మరి చదవాలంటారే!"

"చదవటం అంటే- వ్రాసిన గ్రంథాలు చదవటంకాదు. అది సామాన్యం. చదవవలసింది పుస్తకాలు కాదు ప్రభూ! మానవహృదయాలు. అదే మహాత్ముని ఉద్దేశం."

అయితే ఈ కాలేజీ చదువు అవసరం లేదంటావా!

అవసరంలేదనను. తప్పక కావాలి. కాని ఆ చదువు కంటే ప్రకృతి పాఠశాలలో చదువుకొనే చదువు చాలా గొప్పదని నా నమ్మకం.

ప్రభూ! గాంధీ మహాశయుడన్నట్లు, నేటి ఆంగ్లేయ విద్యావిధానం ఏ విద్యార్థిని మహర్షిని చేసింది—! ఎంతమంది శివాజీ, రాణాప్రతాప్, కృష్ణదేవరాయలను తయారుచేసింది? షాజహాన్‌వంటి ఏకైక ప్రేమమూర్తిని ఒక్కని తయారు చేయగలిగిందా? బుద్ధునివంటి మహాత్యాగమూర్తిని ఒక్కని లోకానికి ఇవ్వగలిగిందా? వాల్లమ్మవంటి సౌజన్యనిధిని దేశానికి చూపించగలిగిందా? మన బాలచంద్రునివంటి భారత వీర ధీరకుమారుని సంఘానికి ప్రసాదించగలిగిందా? మూడువందల సంవత్సరాలయ్యాయ్! మనకేం చేసింది—

"అయితే ఈ విద్య తప్పంటావ్?"

"ఏ విద్యా తప్పుకాదు. కాని నేటి విద్యావిధానం మన అభ్యుదయానికి తోడ్పడలేదు; తోడ్పడబోదు. ఒంటి

కంటె సంఘాన్ని రెండోకన్ను కూడా లేకుండా గుడ్డిసంఘాన్ని చేస్తూంది.

ప్రభూ! విద్యావిధానం మారాలి. స్త్రీ పురుషులందరూ కలిసిమెలిసి భ్రాతృభావంతో సంచరించాలి. అందరూ ఆర్థిక సమత్వం కలిగి ఉండాలి.

ప్రభూ! ఏ నాడు మన దేశంలో ధనికులు దరిద్రులను కాల్చుకుతింటం మానతారో, ఏనాడు స్త్రీ పురుషులిద్దరూ ఆర్థిక స్థితిలో సమత్వాన్ని పొందుతారో, ఏనాడు దేశాభిమానం ప్రజలలో రేకెత్తుతుందో—ఆ నాడే మన సంఘం పశుత్వంనుండి మానవత్వంలోకి ప్రయాణం చేస్తుందనుకో. అంతవరకూ...చూడు... ఆ కాపు కట్టువాసకున్నా స్వతంత్రభావాలుకూడా కలిగి ఉండవనుకో.

అలాగే. ఒప్పుకుంటా. అంచేతే ఖద్దరు బట్టలువేసుడానికి కూడా కట్టువాళ్ళు జడుస్తూంటారు. గాంధీగారి పేరు క్లాసులో చెబుతేనే ఎక్కడ పని తీసివేస్తారో అని లెక్చరర్లుంటే గాంధీగారి మాట వింటానికే భయపడుతూ స్టూడెంట్లున్నారు... అలా కాకుండా కాలేజీల్లోనే రాజకీయ వాతావరణం ఉంటే— ఈ నాటికూడా స్వాతంత్ర్యం రాకుండా ఉంటుందా?

ఉండ దుండదు—

మణీ!

ప్రభూ! ఒక్క మాట చెబుతాను విను. మీవంటి బి. ఏలు నూటికిద్దరు లేరు. కాని మన హిందూదేశంలో నూటికి 70 మంది పల్లెటూరు ప్రజలే. ఇండియా ప్రధానంగా కర్షక దేశమేగాని కార్మిక దేశం కాదు. గోమాత—భూమాత మనకు ప్రధానం. అందుచేత ఈ పల్లెటూరు పూరుకొంపల్లోనుంచి విప్లవజ్వాల బయలుదేరితేనేగాని పట్టణవాసుల్లో విప్లవం ఎలుగలేదు— విప్లవం బయలుదేరవలసింది పట్టణాల్లో కాదు; పల్లెల్లో. పల్లెల్లో బయలుదేరిన విప్లవం సుస్థిరం. కారణాం తెల్లకాగితాలవంటి వాళ్ళ హృదయాలపైన మీరే అక్షరాలు వ్రాసినా అవి సుస్పష్టంగా ఉంటాయ్.

శభాష్ మణీ! బాగాచెప్పావ్! అందుచేత గాంధీజీ విద్యార్థులను సెలవుల్లోనైనా పల్లెటూళ్ళు వెళ్ళి ప్రజలకు రాజకీయ, మత, సాంఘిక, సారస్వత విషయాలు ప్రబోధించాలన్నారు.

ఆయన అన్నారు; మీరు విన్నారు. క్రియ శూన్యం. ఇదే నేటి విద్యార్థుల కర్తవ్యం—

నిజమే. ఎంతసేపూ ఆడిగ్రీ కాస్తా సంపాదించుకొని, బయట పని, ఉద్యోగం సంపాదించుకొని, వేలకువేలు గడించి మేడలుకట్టేద్దామని, నాలుగుసార్లు పేపర్లలో పడి పేరు సంపాదించాలనే కాని మరొక గొడవలేదు.

అంటే రాను రాను భావాలు పల్చబడతూన్నాయ్ అన్నమాట.

తప్పకుండా.

అయితే కాస్త తోడుమజ్జిగ వేయండి. పాలు బాగా తోడుకొంటాయ్.

చిత్తం. ఏంచెప్పినా చెయ్యాలి. తప్పుతుందా! పల్లెటూరు పడుచులు.

అలాగే అండీ శాస్త్రిగార్లు.

ఇద్దరూ నవ్వుకుంటూ లేచారు. ఇంటి ముఖంపట్టారు.

"మణమ్మా! నీమాటలలో ఇంత ఆటుపోటుంటుందే.'

'కొత్త ప్రవాహంలే.'

"ఏమైనా నీవీపల్లెటూరిలో ఉండడం ఈపల్లెటూరు వారు చేసుకొన్నా నోముఫలితం"

'తమరుండడంకాదు.'

"నాదేముంది- బాసిసబ్రతుకు.'

"ఎవరిదైనా అంతే—

ప్రభూ! మనపూర్వులింత వాళ్ళంతనా కృతుకొనేదాని కంటేనునం అలా అవడం మంచిది... అందుకనే మహాకవి గురజాడ అప్పారావుగారన్నారు.

'వెనక చూచిన కార్యమేమోయ్,
మంచిగతమున కొంచమేనోయ్.
మందగించక "ముందు అడుగేయ్;
వెనకపడితే వెనకేనోయ్—"

"బాగా అన్నారు.

'అంచేత 'ముందడుగు" వేయ్'

'ఇద్దరం కలిసి వేద్దాం'

'అలాగే—"

నవ్వుకుంటూ వెళ్లిపోయ్యారు ముందడుగు వెయ్యాలని'

---

iv

గోమాతను, భూమాతను కొలుస్తూ నాటి కొలువులో గల నిర్మలత్వాన్ని చాటుతూంది మణమ్మ. తండ్రిపోయాడని దిగులుపడిపోకుండా కుటుంబభారం అంతా ఒంటరిగా చిరునవ్వుతో భరిస్తుంది.

ఎందరో మొట్టమొదటినుంచీ కష్టాల నెదుర్కొంటంలో ఆమెకన్నా సరదా, సుఖాలనుభవించడంలో లేదు.

నలుంకట్టి నలుగురి సహాయంతో తనకున్నా నాలుగెకరాలూ తానే సాగుచేసుకుంటూంది. తనకున్నా నాలుగు పశువుల్నీ తానే చూసుకుంటూంది.

ఖాళీగా ఉన్న కాలంలో ఏ రాట్నమో వడుక్కుంటూ పిల్లలకు పాఠాలు చెబుతూ, పల్లెలకు రాజకీయ ఖతి పరిపో

ధాలు చేస్తూ ఉంటుంది. గాంధీగారు చెప్పినట్లు "సోమారులకి ప్రపంచంలో స్థానంలేదు' అని చెబుతూ ఉంటుంది. కబుర్లలో కాలం గడపడం అంటే ఆమెకు మంట ఇది ఆమె ప్రవృత్తి.

◆ ◆ ◆ ◆

ఉదయం ఆరుగంటలయింది.

చలికాలం అని గొంగలి ముసుకు పెట్టి, కడుపులో కాళ్ళు పెట్టుకొని పొద్దెక్కినా సోమారుల్లా లేవకుండా- ఉదయానే లేచి సూర్యోదయానికి పూర్వమే ఇంటిపనులన్నీ చేసుకొంటుంది. అది ఆమె అలవాటు.

సంక్రాంతి పండగల్లో చక్కని ముగ్గులు పెడుతూ, నిదరపోయే నలుగురు ఆడవాళ్ళను లేపి, ఆనందంగా పాటలు పాడుకుంటూ పనులు చేసుకుంటూ ఉంటుంది.

◆ ◆ ◆ ◆

ఆవుకు చిట్టూ తౌడూ పెట్టి, పాలుపిదుకుతూ, పాడుకుంటూ ఉంది. ఆమె పక్కనే వచ్చి కూర్చున్నాడు సుబ్బయ్య. ఆమె సుబ్బయ్యను చూచింది.

'ఏవోయ్! సుబ్బయ్యా!'

'అబ్బా! మళ్ళీ సుబ్బయ్యే అంటున్నావు'

'మరి ఏమనాలి'

'నోరారా ఒకసారి 'బావా!' అంటే—ఉబ్బితుకంఠా పంచదార పాకం అయిపోదూ!" అతని అమాయకత్వానికి ఆమె పక్కుమని నవ్వింది.

'అయితే సరేలే.'

'మరి 'బావా!' అని పిలుపు ఒకసారైనా?

ఒకసారికాదు; వేయిసార్లు పిలుస్తా.

ఊఁ కానియ్.

బావా, బావా; బావా; బావా!

చాల్లెమ్మ. ఎక్కాల్లాగ అప్పచెప్పకునా-

అప్పుడప్పుడు సరదాగా మాట్లాడుతూఉంటే అలా మాట్లాడుతూ, మధ్యమధ్య 'బావా! ఏమిటోయ్, సంగతులు మనం ఇకముందు ఎలాగుందాం? అని భార్యభర్తనిలా అనుగతుంది. అలా అడగాలి.

ఉహూ, అదా నీవేషం.

కోంపడుకు.

కోపంలేదులే లేవోయ్ బావా; నాముద్దులబావా'

అతణ్ని వెల్లకిలాతోసివేసి నవ్వుతూ పాలచెంబు తీసుకొని ఇంట్లోకి వెళ్ళింది.

అతగాడు నెమ్మదిగా నవ్వు దాలువుకుంటూ ఇంట్లోకి వెళ్లాడు.

మళ్ళీ ఏం అల్లరిపిల్లవై పోయావు?

బావా, ఏం అల్లరిపిల్లవాడవై పోతున్నావు"

'పడతా పుచ్చుకొని కుర్రాణ్ణిచేసి, అలా ఎలకతలా పడిపోయేటట్లు తోసివేశావే, నేనే నిన్నలా తోసేస్తే."

"పత్న్యురాలగొప్పేయనా!"

'అంతేపనే'

"కాకపోతే నీలా గాజులు తొడిగించుకొన్నానా!!

"అదేమిటి? నేనేం ఆడదాన్ననుకున్నావా!'

'అంతకంటే అన్యాయం"

"ఏం"

"కాకపోతే నీవు ఏ దేశసేవలో నీ నెత్తురిబురదను ఎండ కట్టుతున్నావ్. ఏ పరిశ్రమ్యాసమూలకి నీశక్తినిధారపోస్తున్నావు ఇంట్లో ముండంగాకూర్చొని కబుర్లు చెబుతున్నావు ఎంతసేపూ ఆఆడదానివెనకా, ఈఆడదానివెంటా, ఏదోమిస ఆంబోతులాతిరక్కపోతే ప్రజాసేవ చేయరాదూ, అయినా నీపాలం. అయినా దున్నుకుంటారాని నీవు, నీపొట్టకు కావలసిన భిక్షం అయినా ముష్టెత్తుకుంటంరాని నీవు—ఛీ-ఛీ-నీవూ ఒక మనిషివేనా-

తాతముత్తాతలు గడించిన ఆస్తిమీద ఆధారపడి, తేర తిండి తింటూ పొట్టపెంచుకొని, పందుంగా పెరిగే సోమరిపోతులక్కూడా ఈసృష్టిలో విలువుంటుందీ!"

"మణీ!"

"మగవాడైపుట్టాక ప్రపంచవిషయాలు తెలుసుకో వాలి; ప్రజాసేవ చేయాలి...తనరెక్కలమీద తాను బ్రతి కాలి; పదిమందిని బ్రతికించాలి...తాను ఆత్మస్వాతంత్ర్యం

గురించి, దేశస్వాతంత్ర్యం గురించీ పోరాడాలి; పరిమందిని పోరాడేటట్లు చెయ్యాలి. అప్పుడే మగతనం—అంతవరకూ ఆడదానికంటే కనిష్టమే."

ఆ మాటలతో అతని ముఖం పొయ్యిలో పెట్టిన చిలగడదుంపలా మాడిపోయింది. లోలోపలే మెత్తగా ఉడికిపోయాడు. ఆమె ప్రబోధ్‌ని ప్రేమించడంచేత తనపట్ల నిరసిస్తుందనుకున్నాడు. ఉన్న విషయాన్ని ఋజువు చేయాలనుకున్నాడు.

నాలుగు నిమిషాలవరకూ మాట్లాడుకోలేదు. గొంతుక సవరించుకొని సుబ్రహ్మణ్యం ఇలా ప్రారంభించాడు.

"మణెమ్మా!"

"ఏం."

"ఒక్క విషయం అడగాలని ఉంది అడగనా?"

'తప్పక"

"ఆడవాళ్ళకి అసమర్థులపై ప్రేముండదు కదూ."

"ఉండదు.'

"సమర్థులపై ఉంటుంది కదూ."

'ఉంటుందనేగా దాని అర్థం.'

"కోప్పడకు. అయితే నామీద ప్రేమలేనా.'

'లేకే—ఉంది.'

"మరి ప్రబోధుని ప్రేమిస్తున్నట్లున్నావే'

'నిన్ను ప్రేమిస్తున్నట్లే అతడ్ని ప్రేమిస్తున్నా...నిన్ను

ప్రేమిస్తే అతణ్ణి ప్రేమించకూడదని ఏమైనా ఉందా!'

'ఆహాఁ ప్రేమించను సిద్ధమే. కాని పెళ్ళిచేసుకొంటం అతణ్నా, నన్నా అని నా సంశయం.'

'సంశయం యేమీ అవసరంలేదు. ఇద్దర్నీ పెళ్ళిచేసుకోను.'

'మరి ఎవర్ని చేసుకుంటావ్!'

'ఎవర్నీ చేసుకుంటా! ఎవర్నీ చేసుకోను.'

'మరెలా'

'ఎలా యేమిటి! పుట్టినప్రతివ్యక్తి పెళ్ళిచేసుకోవాలన్న మాట—ఈదరిద్ర భారతదేశానికి మరికొందరు దరిద్ర భారత జీవచ్ఛవాలను కనాలా! గాంధీజీచెప్పినట్లు యావత్ కాలం బ్రహ్మచర్యంచేసి దేశసేవలో మనప్రాణప్రాణాలను రాలిపోనీయరాదూ, ఏం.''

'అమ్మో! చచ్చేవరకూ బ్రహ్మచర్యమే.'

"పోనీ—నీవంటి పిరికివాళ్లు బ్రహ్మచర్యం చేయకండి. ఎవరు చెప్పేమన్నారు 'లోకో భిన్నరుచి'—ఎవరిష్టంవారిది 'యథామతా తథా:థా''—ఎవరిమతాన్ని అనుసరించే వారిమార్గం నీవుచేసేసేవనుబట్టి నీకొచ్చేఫలితం. బుద్ధినిబట్టి పద్ధతి. మనసునుబట్టి మార్గం యేమంటావు'

'సమయనాలో తెలియదంటాను''

'యేమిటోయ్ తెలియుంది,''

ఆమాట అంటూ పరిబోధ్ గుమ్మం ఎక్కాడు. ప్రబోధిని చూడగానే అతని మనసు చివుక్కుమంది— 'పాపకం పుడకలా ఏమి తయారయ్యాడే గా!' అనుకుంటూ "తెలిసిందొకటు ది కాబట్టి, ఇది తెలియలేదని చెప్పా." అని పరిభుతో అంటూ,

మణమ్మా వెళ్ళొస్తా మధ్యనేనెందుకు; ఏదో దయుంటే మీ బావను మరచిపోకు. అని మణితో చెప్పి బిక్కమొఖంతో చక్కాబోయ్యాడు.

మణమ్మా; వాడెవరికీ బావ-

నాకు.

ఓహో; వాడి మరదల వన్నమాట.

ఒట్టు.

మరినాకో.

నీకా...నీకెలాగనుకుంటే అలా.

చెల్లెలనుకుంటే అవుతావా!

తప్పక—

మరదలవనుకుంటే—

'అలాగా అవుతాను'

'భార్యననుకుంటే—'

'ఎన్నటికీ కాను."

'కావ్."

'కాను; ముమ్మాటికీ కాను"

'మరి వాడి కవుతావా!'

'ఎవ్వరికీ కాను.

'సన్యాసినివై మఠాలలో కలుస్తావా"

'చూస్తావుగా"

అతడొక నిట్టూర్పు విడిచాడు. సిగరెట్ తీసి మళ్ళీ ముట్టించాడు. పొగలు చిమ్మి, ఆఇంట్లికొక మిల్లు చేస్తున్నాడు.

"ప్రభూ! అలాపోదాం పద.'

'తోటలోకి పోదామా!'

"ఎక్కడికో - బయలు దేరు"

ఇద్దరూ కలిసి బయలు దేరారు. అలా యువతీ యువకులు కలసి షికారుగా బయలుదేరడం, అప్పట్లో టౌనుకే కాదు; ఏ పల్లెటూరికైనా, వింతే. నలుగురూ నిలబడి వారి వంక వింతగానూ, వెకిలిగానూ చూస్తూ ఉన్నారు. ప్రభువుకు వళ్లుమండింది.

మణీ! ఎలా చూస్తున్నారో చూడు పశువుల్లాగ.

దానికే మిస్టే.

నాన్సెన్స్

'ప్రభూ! క్రొత్తొక వింత, పాతొక రోత' అన్నట్లు క్రొత్తదని ఏదైనా లోకానికి వింతగానే ఉంటుంది దానికి నీకు రోతగానే ఉంటుంది. కారణం నీకిది పాత? వాళ్ళకిది క్రొత్త.'

సమర్థించడంలో నీ తరువాతే లే.

అదైనా ఉండొద్దూ.

ఇద్దరూ కలిసి కొంతదూరం వెళ్ళారు. అంతలో ఆ గ్రామానికి అధికారైన జమీందార్ కొడుకు వీరభద్రరావు గుర్రంమీద స్వారీచేస్తూ వస్తున్నాడు.

భద్రానికి మణి అంటే పంచ ప్రాణాలు. అతడూ పరిబోధ్ 'క్లాసుమేట్లు' ఇద్దరూ ఒకేసారి బి. ఏ. ప్యాస య్యారు. ఇద్దరూ మణిని ప్రేమించారు; పెళ్ళి చేసుకుందా మని నిశ్చయించుకున్నారు. ఆ సంగతి వారు వారొకరితో చెప్పుకున్నారు. నాటినుంచీ లోలోన గోతులు తవ్వుకుంటూ ఉన్నారు.

భద్రం బలవంతంగానైనా మణిని పెళ్ళిచేసుకుందా మనుకున్నాడు. పరిబోధ్ మణి చెప్పిందానికల్లా తలూపి, ఆమెను మెప్పించి పెళ్ళిచేసుకుందామనుకుంటున్నాడు... కేవలం మణి సేవచేసి, పూజించి పెళ్ళిచేసుకుందామనుకున్నాడు సుబ్బయ్య.

ముగ్గురితోటీ ప్రాధాన్యం ఇచ్చి మాట్లాడుతూంది. తీయతేనెలు వర్షిస్తుంది. కాని ముగ్గుర్లో ఎవర్నీ పెళ్ళిచేసుకో నని విస్పష్టంగా చెబుతూంది. చెప్పినా వారామెను విడిచి ఉండడంలేదు.

వాళ్ళేకాదు ఆ పల్లెలో ఆమెను చూచిన ప్రతి యువ

కుమా ఆమెను పెళ్ళిచేసుకోవాలనే దేవుని మొక్కుతూ ఉన్నాడు.

ఇంతమందిని వెర్రెత్తించిన ఆమె ఏమైనా భూలోక సుందరా? కాదు. చామనచాయ. సన్నని శరీరం. అయినప్పుడు ఇంతమంది మోహించడానికి కారణం ఏమిటంటే—ఆమె యౌవ్వనబింకం; మాట పొంకం; చురుకు చూపు; వంపు నడక—అన్నిటికంటే ప్రధానం ఆమె నిష్కల్మషహృదయం, తీర్చిదిద్దిన శరీర లావణ్యం.

కనుమేర దూరాన్నుంచీ మణిని చూశాడు భద్రిం. అతని గొప్పతనం అంతా ఆమె ముందే ప్రదర్శించాలనుకున్నాడు. దానితో ఎక్కడలేని శివి—ఎక్కడలేని మదం—ఆవేశించాయ్. తోవమార్గం లేదు. దృష్టిఅంతా మణి మీదే...శరవేగంగా వస్తూన్నాడు.

మణి ప్రభులు చూశారు.

చూశావ్ మణీ!

చూడకే—అతని గర్వం కన్నులు వస్తూంది. దారి కనబడడంలేదు,

ఇదంతా ఎందుకో తెలుసా?

తెలియకేం!

నీ ముందాతని ప్రజ్ఞ చూపాలని...

కాదు; ప్రజల గుండెలమీద ముందెలా కదనుతొక్కాలో ఇప్పటినుంచీ నేర్చుకుంటున్నాడు.

బాగా గ్రహించావ్

అతడా మాట అంటూనే ఉండగా భీమ్రం "మణీ! మణీ!" అంటూ వచ్చేస్తున్నాడు. అంతే "అమ్మో! అనే పెద్దకేక వేసింది మణి.

ఒక ముసలమ్మ గుండెమీదుంది గుఱ్ఱం కాలి డెక్క. ముసలమ్మ గొల్లుమంది. గుఱ్ఱం ఆమె గుండెమీద ఒక్క సెకను కదనతొక్కింది. అంతే. ఆవేదాటింది. వెంటనే గుఱ్ఱంమీదనుంచి భద్రం ఒక్క దూకు దూకేశాడు. వెంటనే గుఱ్ఱం కళ్ళెం సాహసించి పరిబోధ్ పట్టుకున్నాడు. గుఱ్ఱం ఆగిపోయింది. లాభం ఏముంది? ముసలమ్మ గుండెలనుండి చిమ్మిన నెత్తుటిజల్లు వెల్లువేసిందక్కడ. ఆ దృశ్యాన్ని చూచి అందరికళ్ళూ చెదిరిపోయాయ్.

వెంటనే "అవ్వా!' అని పెద్దకేకవేసి అవ్వమీద వాలిపోయింది మణి. అవ్వ ప్రాణాలు పోయాయేమోనని చూసింది. కాని అవ్వప్రాణాలు పోలేదు. గాయంతగిలింది. నెత్తురు చిమ్మింది.

మణికి కోపం ఆగలేదు. ఆమెను తనరెండుచేతులతో పైకి లేవలేవదీసింది. జనం అంతా రెండుసిమహాల్లో 'హాహా' రవాలుచేస్తూ ఆమెచుట్టూ జేరారు.

మణి ముసలమ్మను తనభుజంమీద వేసుకుంది. ఆమె భుజం అంతా నెత్తుటితో తడిసిపోయింది.

భద్రం! జమీందారు బిడ్డవుకదూ! అంటేతే భూమి మీద కాకుండా మానవహృదయాలమీద కదనుతొక్కిస్తున్నావ్ నీగుర్రాన్ని. తండ్రినిబట్టేకొడుకు...భద్రం నేనెవరకూ మాచెమటతో పెంచిన పంటకాజేసి మున్షీళ్ళు షోకులను చేస్తున్నారు. అదిచాలక మానెత్తురు మీపాదలకు చాలక మీగుర్రపు పాదాలకూ, పారాయణ పూతలనుకుంటున్నారా? అలాగే కానీయండి ఆగుర్రపుగిట్ట లెంత మంది నెత్తుటితో తడిసినవో. ఎంతమంది నెత్తురాగిట్టలనంటి ఎండిపోయినవో. దానిలో మా అవ్వనెత్తురు బొట్టు ఏమూలో భద్రం? జమీందారు బిడ్డవుగదూ నీవు.

ఆమె కన్నులు జ్యోతుల్లా వెలిగిపోతున్నాయ్. 'తానొకటితలుస్తే దైవమొకటి తలచాడు" అన్నట్లు, ఏమణి మెప్పుపొందాలని తాను క్రిందామీదా చూచుకోకుండా గుర్రాన్ని కదనుతొక్కించాడో, ఆమణికే చెప్పలేనంత ఆగ్రహం కలిగించాడు. గజగజా వణికిపోయాడు.

"మణమ్మా! తప్పుచేశా క్షమించు."

"నిన్ను క్షమించినా శిక్షించేనా మాఅవ్వ ప్రాణాలు నిలబడతాయా భద్రం."

"మీఅవ్వప్రాణానికి నాప్రాణం అడ్డువేస్తా. ఆమెకు వచ్చిన ప్రాణభయంలేదు. రాజవైద్యునితో గాయం బాగు చేయిస్తా. ఆమె జన్మజన్మలకి కష్టపడకుండా పదిఎకరాల మా

గాని రాయిస్తా. నాలుగు వేల రూపాయలు జీవితానికిస్తా. ఇంకా నీవేది చెబుతే అది చేస్తా — —"

"అయితే మొదలీమెను బండిమీద తీసుకువెళ్ళి రాజ వైద్యులకు చూపించు"

"అలాగే"

అతడామెను బండిలో వేసుకొని ప్రభుసహాయంతో ఇంటికి తీసుకువెళ్ళాడు — ఏవిటో వెధవమోహం ఎన్ని దుర్గతులకు తీసుకొని పోతుందో చూడండి.

◆ ◆ ◆ ◆

V

ఆఊరు కమ్యూనిష్టులు కొంతమంది రాజకీయప్రబోధాలు చేయాలని వచ్చారు రాత్రి 9 గంటలకు మంటపం దగ్గర సభ ఏర్పరిచారు.

వారు ఉపన్యాసాలు ప్రారంభించారు. రైతులను రక్త పూరితులను జేస్తున్నారు. మణిషదేకం చెప్పడానికి వీలు లేదు. వారితో కలిసి దేశసేవచేస్తే బాగుండునా అనిపించిందామెకు ఆక్షణంలో.

ఆ ఉపన్యాసకులలో బహు అందగాడు— చురుకు చూపువాడు—ఘాటుమాటవాడు— ఈటులేని పోటుబంటు

అమరేంద్రుడనే వాడు ఉపన్యాసవేదికపై నిలబడ్డాడు. అతణ్ణి చూచిందో లేదో మణిహృదయం పున్నమినాటి వెన్నెలలా వెల్లివిరిసి పోయింది. వెనుక నిలబడింది. నలుగుర్ని తోసుకొని ముందుకొచ్చి నిలబడింది— —ఆత్రుతతో ఊరుకోక ఆవేశపడ్డట్లుగానే అతనిదగ్గరే కూర్చుంది. అతడామె శరీరాకృతికి లోలోన వినతులర్పించాడు. ఆమె అతని శాంతాకారానికి ఆమె లోలోన నమస్సు లర్పించింది. ఇద్దరిభావాలూ ఒక్కటే కాబట్టి, ఇద్దరి హృదయాలూ ఒక్కటే అయ్యాయే...

అతనుపన్యాసం ఇలా ప్రారంభించాడు.

“ప్రియతములారా!

నేను నేను చెప్పేమాటలన్నీ మీకు విరుద్ధాలుగా ఉండొచ్చు. కాని కాలంగడచినకొద్దీ ఆలోచించుకొంటే అవి విరుద్ధాలుగా కనిపించవు. యథార్థాలుగా కనిపిస్తాయ్.

ఏ దేశం శాంతి, స్వాతంత్ర్య, అభ్యుదయాలపై [పీస్ ఫ్రీడమ్—ప్రోగ్రెస్] ఆధారపడిఉంటుందో, ఆ దేశంలో కష్టజీవుల కన్నీళ్లు రావు. పతిత మానవజీవిత బాధాగాధలు బయలుదేరవు. ఒకపురుషుడు మరొకపురుషుని నెత్తురుపిండి, కాసులు పండించలేడు. ఒకపురుషుడు మరొక స్త్రీ కన్నులు పెకిలించి అంధురాలను చేయలేడు.

ఆకలిదప్పులతో ఒకడు అలమటిస్తూ ప్రాణాలు విడుస్తూఉంటే ఆప్రక్కనే మరొకడు కోటికి పడగెత్తలేడు.

కరువు కాటకాలు, ఈతిబాధలు ఆ దేశంలో కాలు మోపవు. ప్రజాపరిపీడనానికి అక్కడ తావులేదు.

రాజకీయ, మత, సాంస్కృతిక, సాంఘిక పరిస్థితులు తెలియని ప్రజలు అజ్ఞానులై పశువుల్లా బ్రతుకమంటే— కవులు నవప్రబోధితాలైన కావ్యాలు వ్రాశారు. ప్రజాభ్యుదయానికి తోడ్పడని చెత్తతొత్తు పచ్చిశృంగారపు కావ్యాలు వ్రాసి, ప్రజలను తప్పుడు పథంలో నడిపించరు.

శాంతి, స్వతంత్రాభ్యుదయాలకు ఆలవాలమైన రాజ్యం రామరాజ్యమే — — అట్టి రామరాజ్యానికి మీరు పౌరులు కావాలి, స్వాతంత్ర్యపతాకం ఇంటింటా ఎగిరించాలి, స్వాతంత్ర్యశంఖం ఇంటింటా పూరించాలి. అభ్యుదయపథంలో ఆ విజ్ఞానలతలను పూయించాలి. అందాక మనం మానవులం కాం, పశువులం, స్వార్థపిశాచులం, భూలోకరాక్షసులం, కదిలే శవాలం, పూడ్చబడ్డ సమాధులం, కాలేకాష్ఠాలం— తెలిసిందా!

బాబూ!

యావత్ భారతదేశానికి మీరే వెన్నెముక; మీరే ప్రాణం; మీరే జీవం; మీరే సర్వస్వం. మీరు పండించిన పంటే లేకపోతే పట్నాల్లో తిండిలేక చచ్చినవారి శవాలను

శ్మశానంవరకూ ఈడ్చుకుపోయే మనుషులే ఉండరు- ప్రతి పూటా వారుతినే అన్నం మీరుచెమటూడ్చి, కష్టించి, పండించే పంటే. మీరు కోటాను కోట్ల భారతీయులను పోషిస్తున్నారు. కాని మీరేమిమ్మల్ని పోషించుకో లేకపోతున్నారు.

చూచారా ఎంత ఘోరమో! ఎంత అక్రమమో! ఎంత అన్యాయమో!

మీరాఇతరులకు మూడుపూటలా తిండి పెడుతున్నారు; కాని మీకురెండుపూటలుకూడా కడుపునిండా తిండిలేదు... మీరు దేశానికి బట్టనిస్తున్నారు; కాని మీకు కట్టుకుంటానికి వంటినిండాబట్టలేదు.

దీనికి కారణం ఎన్నడైనా ఆలోచించారా? ఒక పేద రైతు ఎన్నడైనా లక్షాధికారి కాగలుగుతున్నాడా? లేదే-

చూడండి మీలో ఎందరికి కప్పుకుంటానికయినా బట్టలులేవో. ఎందరికి తిండిలేక శుష్కించిపోయారో

దీనికి కారణం "ఇది' అనిఎవ్వరైనా చెప్పారా? లేదు. చెప్పరు. చెబితే మీరు బాగుపడితే వారు మేడలెలా కడతారు.

బాబూ! కారణం చెబుతా వినండి——

ఈకట్టినేలను నాగలి మొనతో మీ పేరునాటి, మీ చెమటపోసి దున్నుతున్నారు. మీకన్నీటితో గింజలు నాటుతున్నారు, వంగిపోయిబయటకనపడే మీగుండెమీద ఎముక

ఖోవంటి కొడవళ్ళతో కోస్తున్నారు. ఎద్దులతో తొక్కించి గింజ రాల్చేస్తున్నారు. ఆగింజలు బస్తాలకు ఎత్తుతున్నారు.

అదంతా మీకష్టార్జితమేకదూ! కాని ఆబస్తాలన్నీ మీ ఇళ్ళకు వస్తున్నాయా? లేదే—

ఏఊళ్ళోనో ఉన్నా భూమిగల పెద్దఆసామికి పంపిస్తున్నారు. అతడు రైతుకాడు; [illegible] భూస్వామి. నిజానికి మీరే రైతులు. మిగిలిన బస్తాలు పన్నుక్రింద జమీందారులకు పంపుతున్నారు.

ఇంక ఏడాదికి మిగిలేవి ఏఒకటో, రెండో బస్తాలు గడ్డి— గడ్డిగోవులకు ఎద్దులకూ చాలదు; మిగిలిన ధాన్యం మీకూ మీపిల్లలకూ చాలదు.

దానితో మీపశువులు బక్కచిక్కి ఎముకలగూళ్ళలాగ తయారౌతున్నాయ్; మీరో పంజరాల్లాగ తయారౌతున్నారు. తెలిసిందా? ఇప్పటికైనా మిమ్మల్ని దోచేదొంగ లెవరో తెలిసిందా?

కష్టపడడం మీవంతా-మీకష్టాలవల్ల సుఖపడడం వారివంతా? ఎక్కడిదీ న్యాయం. ఏమంటే—మీ కర్మం అంటారా!

మాటాడితే మమ్మల్ని దేవుడు భాగ్యవంతులుగా పుట్టించాడు, మిమ్మల్ని దేవుడు పేదవాళ్ళగా పుట్టించాడు. మా కర్మది; మీ కర్మది; అంటారా? దేవుడెక్కడా పక్ష

పాతం అంటగడతారా? కన్నతల్లే పిల్లల్ని సమానంగా కంటుందే, భగవంతుడంతటివాడు మానవులనందర్నీ సమానంగా సృష్టించడా? యోచించండి.

ఇలాగే 1917 సంవత్సరంముందు రష్యాలో తిన తిండి లేక కొందరు చస్తూంటే, ఉన్నా ధన ధాన్యాలు దాచుకో లేక మరికొందరు చచ్చేవారు. ఈ అన్యాయం చూచి, మార్క్సు, టాల్‌స్టాయ్, ఏంజిల్సు, లెనిన్, స్టాలిన్, గార్కీ, మాక్సిమ్ గోర్కీ, టర్జనోవా, డాస్టవెస్కీ మొదలగు మహాత్ములు, రాజకీయ దురంధరులు అయాట పరిజలలో విప్లవజ్వాలలు రేకెత్తించారు. దాంతో దేశంలో విప్లవం చెలరేగింది. భాగ్యవంతుల భాగ్యం అంతా పరిభుత్వంలీనమైంది. అంతే, ఆనాటినుంచి నేటివరకూ అక్కడ అన్నమో రామచంద్రా అనేవాళ్ళు లేరు.

1917 కు ముందు రష్యా పరిస్థితి నరకం; నేడు స్వర్గం. నాడు ఆకలి దప్పులున్నాయ్; నేడు లేవు. నాడు చదువుకోనివారున్నారు; నేడు లేరు. నాడు స్త్రీ స్వతంత్రం లేదు; నేడుంది. నాడు దరిద్రులూ ధనికులూ ఉన్నారు, నేడు లేరు.

దీనికి కారణం ఏమిటి? కర్మా? భగవల్లిఖితమా? కాదు—మానవ శాసనం. అది మరచిపోకండి. దేవుడొక్క

రోజానవచ్చి భాగ్యవంతుల నొసటి రేఖలన్నీ చెరిపివేయలేదు. అలా చెరిపివేసింది ప్రభుత్వం.

మీ రెందుకీ భూ స్వాములకు-జమీందారులకు అంతంత డబ్బు ఇవ్వాలి. భూమి వారిదంటారా, సగం వారికివ్వండి, సగం మీరు తీసుకోండి. అది మీరంతా ఒకటైతే సాధించగలరు...

వెనక వడకండి, 'ము ం ద డు గు' వేయండి—అంటుంటే "వెనకపడం-ఎన్నటికీ వెనకపడం. ముందడుగు వేస్తాం. అంతా ఐక్యంగా పనిచేస్తాం. దేశ స్వాతంత్ర్యం సంపాదిస్తాం. ప్రజాభ్యుదయానికి ప్రాణాలర్పిస్తాం. జై భారత మాతకు జై" అని మణమ్మ లేచి ఉద్రిక్తంగా అతనికడ్డువచ్చి మాటలాడి, 'జై' అనే సరికంతా "జై జై" అంటూ లేచిపోయారు.

దానితో మునసబు, సుబ్బయ్యా, కరణం మొదలగు ప్రభుత్వాభిమానులు నానామాటలు వారికి వ్యతిరేకంగా అన్నారు. అక్కడనుంచీ తిట్లాటలు, పోట్లాటలోకి దిగాయ్. ప్రజలంతా చెల్లాచెదురైపోయారు. ఆడవారూ పిల్లలూ పారిపోయారు.

ప్రబోధానికి వచ్చిన కమ్యూనిష్టులు మరో గ్రామం వెళ్ళాలని స్టేషనుకు నడిచి వెళ్ళిపోయారు. కాని మన అమ

రేంద్రుడు మాత్రం కరణంతో పోదిస్తూ వారితో వెళ్ళలేక పోయాడు. ఆసంగతి మణెమ్మకు తెలీదు.

◆ ◆ ◆ ◆

మణెమ్మ ఇంటికివెళ్ళి భోంచెయ్యకుండా సావిట్లో కిటికీ దగ్గరకూర్చుని రోడ్డుమీద వెళ్ళే పోయే వాళ్ళను చూస్తూ ఉంది.

అమరేంద్రుడు ఎంత చదువుకున్నవాడు. ఎంత చక్కగా చెప్పాడు. ఒకో పల్లెటూరుకు ఒకో అమరేంద్రుడైనా ఉంటే-ప్రజలు విజ్ఞానులయ్యేవారుకదా!" అనుకుంటూ అమరేంద్రుని ప్రతిభను గురించి భావిస్తూ కూర్చుంది.

రాత్రి 10 గంటల నర అయింది.

పండు వెన్నెల కనులపండువగా ఉంది.

అంతలో దోవతప్పిన అమరేంద్రుడా దోవన వెళుతూ ఉన్నాడు ఒంటరిగా ఆమె చూచింది. కొంతసేపు స్వప్నమా? సత్యమా? అని వ్యాకులత పడింది.

బయటకు వెళ్ళి చూసింది. ఇంకెవరు? తన ఆత్మీయ జీవన బాంధవుడు; అమరేంద్రుడే!

"అమరేంద్రా?"

అతడాగి చూచాడు.

"అమర్!"

"ఎవరు? మణీ!"

నా పేరెలా తెలిసిందే?

ఎవరో చెప్పారు—'నా తరువాత మాట్లాడిన ఉద్రిక్తమూర్తి ఎవరు?' అని అడిగితే నీసంగతి.

మంచిది-ఇలా ఎక్కడకు?

స్టేషనుకు.

మార్గం ఇటుకాదే-

మరి ఎటు?

నేను చూపిస్తాలే. రా—ఇలా రా!

ఎందుకు శ్రమ మాస్త్రా!

భోంచేసి వెళుదువుగానిలే రా! అలసిపోయావ్.

ఆకలి లేదే.

మొహం వాగడ పెరుగు చూస్తే ఆకలి పడుతుంది. లే-రా. రావోయ్! పరిభూ జీవన దాతా!-అంటూ అతి స్వతంత్రంగా ఆయన చేయిపుచ్చుకొని లోపలకు తీసుకు వెళ్ళింది.

అమరేంద్రుడామె స్వతంత్ర జీవితాన్ని చూచి ఆశ్చర్యపోయాడు...

ఆమె పరుగు పరుగున లోపలకు వెళ్ళింది. వేడినీళ్ళు కాళ్లు కడుక్కొంటానికిచ్చింది. తువ్వాలు పట్టుకుని నిలబడింది. అతడు ముఖం తుడుచుకుని ఆమె చూపిన నులకమంచంమీద కూర్చున్నాడు.

రాముని చూచిన శబరిలా, ఆ దేశభక్తుని చూసే సరికి ఆమె భక్తి పారవశ్యంలో మైమరచిపోయింది.

అతనికి చక్కని అరటాకులో భోజనం వడ్డించింది. నెయ్యి కాచి గిన్నెలో పోసి పెట్టింది. మీగడ పెరుగు, ఊరగాయిలూ పెట్టింది.

రావోయ్! అమరేంద్రా! ఇందుకు రావోయ్ ఆతిథ్యానికి!

ఏమిటి? కవిత్వం కూడానా?

కళామూర్తివి, నిన్ను చూస్తే కవిత్వం రాకుండా ఉంటుందా?

మణెమ్మా! నీవు భోంచేశావా?

లేదే.

మరి నాకొక్కడికే పెట్టావే?

మగవాళ్ళు తిన్నాక తరువాత ఆడవారు భోంచెయ్యడం ఆచారంగనుక.

అది నాటి ఆచారం, నేటి ఆచారం అంతా కలిసి భోంచెయ్యడమే నాడు సంఘంలో స్త్రీ పతిత; నేను స్వతంత్రురాలే నీవూ భోజనం పెట్టుకో. ఇద్దరం కలిసి భోంచేద్దాం.

"సరే. తృప్తిగా ఉందా? పతిభావులాజ్ఞ

ఆమె నవ్వుతూ వంటింట్లోకి వెళ్ళి గిన్నెలో భోజనం పెట్టుకొని, కావలసినవన్నీ అక్కడే పెట్టి కూర్చుంది.

ఇద్దరూ ప్రారంభించారు భోజనం.

అతడు మొగమోటంపడి నెయ్యి కొద్దిగా వడ్డించుకున్నాడు. ఆమె నేతిగిన్నె అతని అన్నంపై దిమ్మరించింది.

'చంపేవ్ మణీ!'

"ఏం!"

'కమ్మని నెయ్యి తాగగానే సరికాదు; అయ్యేదాహం తీర్చాలి"

"దాహం తీర్చుకొనేశక్తి లేకపోతే ఇలాపడేయ్'

'చాల్లే. ఊరుకో. ఎంగిలికూడానా!'

"ఎంగిలి పరులకు- నాకేమిటి? అమర్? మనం అంతా ఒక్కకుటుంబానికి చెందిన వాళ్ళంకావోయ్, మనం సేవించేది ఒక్కతల్లినేకదూ'

'కాదని ఎలాగంటాను? అంతా ఒక్కతల్లి బిడ్డలమే'

"మరింకే..."

"ఏమీలేదులే..."

'అమర్! ఇంకా ఎన్నిఊళ్ళు తిరగాలి'

'లెక్కలేదన్న'

మరినీతల్లి దండ్రులెలా ఊరుకున్నారు?

"ఊరుకోకేం? ఎవరిక్కైనాకావలసింది. ప్రజాసేవేగా

"బాగు. బాగు. నీభార్యా ఎలా—"

'ఊరుకుంటానికసలు నాకు భార్యేమిటి? పెళ్ళి చేసుకొంటే—'

"ఏమిటి? పెళ్లే చేసుకోలేదూ"

"ఎందుకమ్మా నీకా ఆశ్చర్యం! ఈబానిస దేశంలో పెళ్లిచేసుకొనేటంత దౌర్భాగ్యుడనంటావా? పెళ్లిచేసుకొని దరిద్ర ప్రజలకు మరికొందరిం దరిద్రులను జతచేసే పాపం కట్టుకోనా?"

'అయితే పెళ్లిచేసికోవా"

'స్వతంత్రం లభించే వరకూ చేసుకోను'

'శబాష్! అమర్! నీవు నిజంగా అమరుడవే"

"ఇద్దరిభోజనాలు కావచ్చాయ్.

అమర్ - నాకెవ్వరూ లేరోయ్'

అవును. విన్నా.

"నన్ను నీతో తీసుకుపోరాదూ! నేనూ మీతో కలిసి ప్రజాసేవ చేసుకుంటా".

వద్దు మణమ్మా! వద్దు. నీ ఆశయానికి, నీ కర్మదీక్షకు నాకు చాలా ఆనందం. కాని నీవు ఈ ఊరిలోనే ఉండాలి.

ఏం?

ఉండి జమీందారు దౌర్జన్యం, భూ స్వాముల దౌర్జన్యం ఎదుర్కోవాలి. ప్రజలలో రాజకీయ వాతావరణం ఏర్పరచాలి. అది నీవిధి.

అలాగే.

భోజనాలయ్యాయ్. అతడు ఆమెదగ్గర సెలవుతీసు

కొని బయలుదేరాడు.

అమర్! వెళుతున్నావా?

తప్పుతుందా మణితల్లీ!

అమర్...

మణీ! స్టేషనుకు త్రోవెటు?

అటు-గమ్యస్థానం చేరడానికి మార్గం అటు. మార్గం కంటకావృతమైనదినుమా. త్రోవ పొడుగునా రాళ్ళగుట్టలు. ముళ్ళపొదలు. విష సర్పాలు. నీవు ఒంటివాడవు. ప్రయాణం చాలా దూరం చెయ్యాలి. జాగ్రత్తనుమా! కన్నుమూశావా అంటే కాలు ముళ్ళకంచిలో పడిపోతుంది. తలతిప్పావా అంటే పాము కాటువేస్తుంది. జాగ్రత.

అతడు చిరునవ్వు నవ్వాడు.

మణమ్మా! నీవు నిజంగా నాకంటే విజ్ఞానివి. ప్రతి మాటా భావగర్భంగా మాట్లాడగల ప్రజ్ఞాశీలివి. జీవయాత్రకూ, నా మార్గానికీ పోల్చి చాలా చక్కగా చెప్పావ్. నీకు నా ధన్యవాదాలు.

ఎంతమాట.

సెలవా?

మంచిది. అమర్! మళ్ళీ ఏ జీవన నదీతీరాన్నో కలుసుకుందాం. అందాక ఈ నీ చెల్లెల్ని మరచిపోరాదుసుమా!

ఎన్నటికీ మరచిపోలేను చెల్లీ!

వెళ్లి రా అమర్! అన్నా వెళ్లిరా!

ఆమె కన్నీళ్లు జల జారిపోయాయ్. అతడు కన్నులు తుడుచుకుంటూ వెళ్లిపోయాడు.

ఆమె అతని పాదాలు మోపబడినచోట తలవంచి నమస్కరించి, కన్నులకద్దుకుంది.

ఇదంతా చూస్తూన్న ప్రభు ఆశ్చర్యపోయాడు.

మణమ్మా!

ఏం ప్రభూ!

ఏమిటీ తన్మయత్వం? ఎందుకలా నమస్కరిస్తున్నావ్!

ప్రభూ! అతడు నా దేవుడోయ్!

అదేమిటి?

నిజమైన దేశభక్తులందరూ నాకు దైవ స్వరూపులే.

వాడొక దొంగభక్తుడు కాకూడదు?

పిచ్చిఅండీ! కాంతా, కాంచనములకు లొంగనివాడే దొంగభక్తుడైతే, ఇక నిజమైన భక్తుడెవ్వడు?

అతడలాగే నిలబడి పోయాడు,

ప్రభూ! అతనిలోని దేశభక్తి, ప్రజాసేవ, కార్యదీక్ష, ధర్మదీక్ష—నీకెన్ని జన్మలకు అలవడుతాయో! వెళ్లు... ఆయన పాదాలపైబడు...ఏమైనా మోక్షం వస్తుందేమో!

ఆమె మాట్లాడకుండా లోపలకు వెళ్లి "అమర్! నాలో అమరసంగీతాన్ని మేలుకొల్పి పోయావోయ్! ధన్యుడవు" అనుకుంటూ తలుపులు వేసుకుంది ప్రభు ఇంటిముఖం పట్టాడు.

అబ్బా! భక్తులకు ఆరాధ్య దేవతలు కనబడితే ఎంత ఆనందం!

vi

ప్రదిహేను రోజులయింది.

మునసబు కరణాలు నలుగురు జమీందారు బంట్రోతు లతో పన్ను వసూలు చేస్తున్నారు. పన్నులు ఇవ్వనివారి ఆస్తులు జప్తుచేసున్నారు. జమీందార్ కుమారుడు భద్రం ఆయేడు స్వయంగా వసూలు చేస్తున్నాడు. పూర్వపు బాకీ లన్నీ గట్టిగా వసూలు చేస్తూన్నాడు.

మణమ్మ ఇవ్వనన్నది. గంభీరంగా నిరాకరించింది. ఎట్టి కష్టాలకైనా సిద్ధపడతానుగాని పన్ను లీయనంది.

భద్రం ఒక్కడే ఆమె ఇంటిలోకి వెళ్లాడు. నలుగురు బంట్రోతులూ బయటున్నారు.

మణమ్మా! నీవు రెండు పన్నులివ్వాలి సుమా!

ఏంపన్నులు?

ఇంటినేల పన్ను; పొలం పన్ను.

నేలపన్ను ఇవ్వాలా? ఎందుకు?

నేల మాదికాబట్టి.

పిచ్చితండ్రీ! నేల మీదెలాగయింది.

మాకు పెద్దలనాటినుంచీ వస్తూంది.

మీ పెద్దల నాటినుంచీ ఈ నేల ఇక్కడేఉంది. ఇది నీదికాదు; నాదీకాదు. అందరిదీను. అలాగే పొలంకూడా ఎవరు పండించుకుంటే వారిదే.

"అయితే ఈయవా!"

"ప్రాణంపోతే ఈయను.

"మణీ! చెడిపోతున్నావు? చెబుతున్నాను విను. నన్ను పెళ్లిచేసుకుంటే ఈ భూములన్నీ నీవే అవుతాయ్. లేకపోతే—

"నీవవుతావు. అంతేనా? భద్రం! ఈ బెదిరింపులవల్ల పూర్వంఉండే గౌరవ భావంకూడా పోయి, చులకన భావం ఏర్పడిందని మరచిపోకు'

'అలాగా... మణీ! నిన్నేంచేస్తానో చూచుకో.'

పిచ్చివాడా! బెదరించి నన్ను పెళ్లి చేసుకుందామనుకున్నావా? ప్రజల నెత్తురు పీల్చే నీవంటి స్వార్థపరమాలిని, దేశ సేవ తెలియని మూర్ఖున్ని ఈమణి వివాహం చేసుకోదనుకో. ఏ దేశసేవకుడో ఏ త్యాగమూర్తినో మణి సేవించగలదు. నీవంటివానిని—"

మణీ! నీయిల్లూభూమీ తగల పెట్టేస్తా"

అంతేకాదు? నన్నుతగలపెట్టినా లెఖ్ఖచేయనునుమా ! నీలా పిరికిదానను కాను.

నీకు తలదాచుకుంటానికి స్థలం ఉండదు.సుమా!

ఆకాశంఅంతా నీదికాదుగా.

అయితే బయటకు వెళ్లు.

వెళుతున్నా.

అరేయ్! ఆపకువుల బంధాలు తెంచేయ్,

ఆమె బయటకు బయలు దేరింది. ఆమిదాశ్యబంధాలు తెగినట్లే, పశువుల బంధాలుకూడా తెగలబడిపోయాయి.

అరేయ్ మణిభూమిపైన తగల పెట్టేయండి.

బంటోతుల యమకింకరులాగ బయలు దేరారు.

భద్రం! తగలబెట్టేది నాభూమికాదు; నీభూమి. బాధ పడేది నేనుకాదు, నీవే— 'సత్యంగురించి నేను పోరాడే పోరాటంలో లోకంఅంతా ఒకటికావచ్చు, నేను ఒక్కడనే,ఒకటిగావచ్చు. కాని నేను పోరాడకుండా మానను. ఒంటిగానే పోరాడగలను. అని మనగాంధీమహాత్ముడు చెప్పినమాటలు మరచి పోకు.

అలాగే పిరికివాళ్ళె ఈఅమాయకులంతా నీకు లొంగినా, నేను లొంగననుకో— స్వతంత్రం గురించి నాప్రాణాలయినా, విడిచేస్తాననుకో. నాహాలాన్ని తగలపెట్టినా నీకక్ష తీరకపోతే- నాప్రతిఅవయవం ముక్కలు ముక్కలు చేసి ఆమంటలో వేస్కోయ్. భయపడను—

భద్రం—ఈమణి ఊహించేది వెనుకేం జరిగిందో అని కాదు, ముందేం జరగాలోఅని— చూచేది ముందుకే, వెనుకకు కాదు—నడిచేది ముందుకే, వెనుకకుకాదు.

"వేయివోయ్ మగవాడ ముందడుగు వేయివోయ్'
వేయవోయ్
ముందడుగు వేయవోయ్,

వెనుక పడితే

వెనుకేనోయ్—'

ఆమె ఆమాటలంటూ గంభీరమూర్తియై ఏకాకి లాగ వెళ్ళిపోతూంది.

తాను చెమటూడ్చి పెంచి పోషించిన వరిపొలం పక్క నుంచి వెళ్ళిపోతూంది.

పొలంలంతా 'భగ్గుభగ్గు'' మని మండిపోతూంది.

ఆమె పొలాన్ని నలుగురుతగల బెడుతూన్నారు. వారి వద్దకు వెళ్లింది.

బాబూ! ఇది ఎవరి పొలం?'

నీపొలమేగా.

కాదు మీపొలం.

మాపొలమా!

కాదు మనపొలం,

"ఆc!"

,,అహహ! అహహ! బాబూ! గాంధీజీలా ముందడుగు వేయండి. వెనుకపడితే వెనకే— విషయాలు తెలుసుకొని ముందడుగు వేయండి- కాల్చేభూమి నాదికాదు, మీదే.

,,మీదే—''

ఆమె వెఱ్ఱిగా నవ్వుతూ ఆమె పెంచిన వరి తగలబడి పోతూంటే చూస్తూ ఆఊరు విడిచిపెట్టి ఏకాకియయి వెళ్లి పోతూంది,

ఎక్కడికి-?

నిర్మలానంద సీమకు—

ఎందుకు-?

స్వతంత్ర్య సమ పార్జనకు—

ఎలా-?

ముందడుగు వేసి—

శభాష్! భారతనారీ! శభాష్!

అందుకో తల్లీ! నాధస్వవాదాలందుకో!

నమస్సులు—

స ం పూ ర్ణ ము.